
**కథానిక**

# రైలు వెళ్ళిపోయింది



– మడపల్లి రమేష్‌రాజు

(గత సంచిక తరువాయి)

లోకమంతా తన కళ్ళముందు తల్లకిందులైపోయినట్టు... జీవితం మొత్తం అంధకారం అయిపోయినట్టు....'

'ఆ రోజు, నాన్నగారు కట్నంగా ఇవ్వాల్సిన అయిదు వేల రూపాయలు, మగపెళ్ళి వాళ్ళకి ఇచ్చిరావడానికి వెళ్ళారట. 'అబ్బాయికి మోటారు సైకిలు కొనాలి, మీరు కనీసం మూడువేలైనా పెట్టుబడి పెట్టాలని, పెళ్ళివాళ్ళు పట్టుపట్టారట. అప్పటికే తలకి మించిన అప్పులు చేసి పెళ్ళి ఏర్పాట్లన్నీ చేసేశారట, మరో మూడువేలు ఎక్కడ్నించి తేవటం అని నాన్నగారు బెంగపెట్టుకుంటూ ఇల్లు చేరి, గుండె ఆగి చనిపోయారట. కార్యాలన్నీ అయ్యాక బాబాయి, పెళ్ళివాళ్ళ దగ్గరకి వెళ్ళి, మళ్ళీ ముహూర్తాలు పెట్టుకుందాం అంటే, వాళ్ళు మాట దాటవేశారట.

'ఆ రోజునుంచీ, తనే ఆ యింటికి పెద్ద దిక్కై పోయింది. ఇద్దరు చెల్లెళ్ళకు పెళ్ళిళ్ళు చేసింది. తమ్ముడు వెంకూని కంప్యూటర్ కోర్సులో చేర్పించింది. కుటుంబంలో అందరూ తనని ప్రాణం కన్నా ఎక్కువగా చూసుకుంటారు. మరి ఎందుకు దుఃఖం?... ఎక్కడో ఏదో వెలితి. 'నిన్ను నిన్నుగా ప్రేమించుటకు – నీకోసమే కన్నీళ్ళు నించుటకు – నేనున్నానని నిండుగపలికే...' తోడు... అలాంటి తోడు, తనకి ఎవరున్నారు? అమ్మా... పండుటాకు. ఇంకా ఎన్నాళ్ళుంటుంది? చెల్లెళ్ళా?... పెళ్ళిళ్ళయ్యాక వాళ్ళ సంసారాలు వాళ్ళవి. తమ్ముడు వెంకూ?... రెక్కలొచ్చాక గూటిలో నిలబడతాడా? ఇంత పెద్ద ప్రపంచంలో తనకోసం అంటూ ఎవ్వరూ లేరా?

'జీవితంలో మొదటిసారి, చారుమతికి, తనలోని ఒంటరితనం, వెయ్యి నాలుకలతో తనని భయపెట్టింది. జీవితమంతా చీకటి ఎడారి... ఆ ఎడారిలో తను ఏకాకి...' చారుమతికి గుండె చాలా బరువుగా అనిపించింది. రైలు పెట్టె కిటికీలన్నీ మూసేసి ఉన్నాయేమో, ఊపిరి ఆడటం కష్టంగా ఉంది. ఒళ్ళంతా చమటలు పోసేస్తున్నాయి. లేచి కూర్చుంది. 'ఇప్పుడు ఏం చెయ్యాలి తను?' రైలు పెట్టెలో అందరూ గాఢనిద్రలో ఉన్నారు. రైలు గోదావరి బ్రిడ్జి మీద సాగుతోంది. ఆ శబ్దం చారుమతికి ఎవరో తన గుండెమీద సుత్తితో బాదుతున్నట్టనిపిస్తోంది. అతి కష్టంగా లేచి, అడుగులో అడుగువేసుకుంటూ వెళ్ళి సింక్‌లో ముఖం కడుక్కుంది. ఆ చల్లటి నీళ్ళ తాకిడికి కాస్త ఉపశమనం అనిపించింది. కాస్త చల్లటి గాలి శరీరానికి తగిలితే మరికాస్త బావుణ్ణుననిపించింది. కానీ ఎలా? ధైర్యం చేసి మెల్లగా రైలు పెట్టె తలుపు తెరవాలనుకుంది. కానీ భయం 'తను గోదాట్లోకి పడిపోతే?... ఎంత హాయి, తనని ఇన్నేళ్ళుగా వెంటాడుతున్న భయాలు బాధలు, తను కన్న కలలు, అవి ఫలించక చేసుకుంటున్న సర్దుబాట్లు – కాదు – త్యాగాలు, అన్నింటికీ ఒకేసారి తెరపడుతుంది. జీవితమంతా ప్రయత్నించినా దొరకని మనశ్శాంతి, అరక్షణంలో ఈ క్షణంలో తను తలచుకుంటే, అందుతుందేమో! ఆత్మకి చావులేదంటారు. తను ఈ జన్మలో చేసిన త్యాగాలకి, మరుజన్మలో దేవుడు తప్పకుండా సుఖశాంతులు ప్రసాదిస్తాడు. ఒక నిర్ణయానికి వచ్చినట్టు చారుమతి రైలు తలుపు తెరచింది. అందాకా లోనికి జొరబడడానికి వ్యర్థ ప్రయత్నాలు చేసిన ఈదురుగాలి ఒక్కసారిగా చారుమతిని చుట్టి వాటేసుకుని ఉక్కిరి బిక్కిరి చేసింది. ఎదురుగా వేగంగా కదిలిపోతున్న బ్రిడ్జి రైలింగ్స్, చారుమతికి కళ్ళు తిరిగేలా చేస్తున్నాయి. చారుమతి సుడిగాలిలో చిగురాకులా విలవిలలాడిపోతోంది. పాదాలకింద ఏమీ ఉన్నట్టులేదు. 'తను ఈ జీవితాన్ని – ఈ దుర్భర జీవితాన్ని – ఈ అనంత బాధామయ గాథల జీవితాన్ని – చాలించినట్టేనా? తనకింక ఏ బంధాలూ లేవా? తను ఇప్పుడు విముక్తురాలా? తనిక డబ్బు సంపాదించిపెట్టే యంత్రం కాదా?... మరి అమ్మకి మందులు ఎవరు కొనిపెడతారు? తమ్ముడి కంప్యూటర్ కోర్సుకి, నెలతిరిగేసరికి ఫీజులు ఎవరు కడతారు? చెల్లెళ్ళ పురుళ్ళు పుణ్యాలకి ఎవరు ఖర్చులు భరిస్తారు? ఇన్ని ప్రాణులు తనపై ఆధారపడి ఉన్నప్పుడు తనకి విముక్తి ఎలా సాధ్యం? ఈ బంధాలు తెంచుకునే శక్తి తనకి ఉందా?'... తనకున్న బలాన్నంతా కూడ కట్టుకుని, రైలు తలుపు మూసేసింది చారుమతి. 'తనింకా బతికే ఉంది'.

భారంగా అడుగులు వేసుకుంటూ వచ్చి తన బెర్త్‌పైన చతికిలపడింది చారుమతి. జీవితం ఎప్పుడూ అనిపించనంత గాఢాంధకారంగా కనిపిస్తోంది. నిరాశా నిస్పృహలు, గుండెని కాల్చివేస్తున్నాయి. తనకి తెలియకుండా నిట్టూరుస్తోంది. 'ఏదో ఒక దారి చూసుకోవాలని... ఈ ఒంటరితనం తనింక భరించలేదు....' ఒక దృఢ సంకల్పం చారుమతి మెదడులో మెదిలింది. 'ఈ ఏటితో వెంకూ కోర్సు పూర్తవుతుంది. ఏదో ఒక మంచి ఉద్యోగం దొరకకపోదు.... అమ్మనీ, చెల్లెళ్ళనీ ఇక వాడే చూసుకోవాలి. తను ఇన్నేళ్ళు చేసిన త్యాగం ఏం తక్కువది కాదు. తను అనాకారి కాదు.

వయస్సు మీరిపోలేదు. తనకంటూ ఒక జీవితాన్ని కోరుకోవడం నేరం అంతకన్నా కాదు. స్వార్థం అసలు కానేకాదు. కావలిస్తే అమ్మ తనదగ్గరే ఉంటుంది. పురుళ్ళు పుణ్యాలు.. సంసారంలో, పెద్దవాళ్ళు పక్కన లేకపోతే ఎంతో కష్టం. తనెందుకు మోడులా ఇలా మిగిలిపోవాలి?' – ఈ ఆలోచన చారుమతి మనస్సుని కాస్త కుదుటపర్చింది. రైలు పెట్టెలోని గుడ్డి వెలుగులో, ఎదురు బెర్త్ మీద నిద్రపోతున్న వ్యక్తిని తదేకంగా గమనించింది చారుమతి. 'అచ్చు గుడిపాటి వాళ్ళ అబ్బాయిలానే ఉన్నాడు' అనుకుంది. తనా అబ్బాయిని పెళ్ళిచూపులనాడు కళ్ళెత్తి ఓ అరక్షణం చూసింది. అదికూడా పదిహేను ఏళ్ళ క్రితం. అయినా పోలికలన్నీ తన గుండెల్లో ముద్రించుకుని ఉన్నాయి. – 'ఇతనే ఆ అబ్బాయి అయితే?... ఇతనికి ఇంకా పెళ్ళైనట్టులేదు. పెళ్ళైగనక అయివుంటే ఇంత బిడియపడుతున్నట్లుగా కనిపించడు. అదీకాకుండా, ఏ భార్యా భర్తకి మంచినీళ్ళ సీసా కూడా ఇవ్వకుండా ఇలా ప్రయాణానికి పంపించదు. సంసార పక్షమైన స్త్రీ ఏ పులిహోరో, పూరీలో కట్టి ఇచ్చి సంచిలో నీళ్ళసీసా పెట్టి మరీ పంపిస్తుంది. ఆ పాటి దక్షత కూడా లేదంటే – భార్యన్నా లేకుండా ఉండాలి... ఉదయం లేవగానే ఇతనితో మాట్లాడితే?... తప్పేం ఉంది?... పదిహేనేళ్ళ క్రితమే ఆపని చేసి ఉండాల్సింది.... కానీ అప్పుడు తనకి అంత ధైర్యం లేకపోయింది. అంత ధైర్యం ఇచ్చేవాళ్ళూ లేకపోయారు. 'బెటర్ లేట్ దేన్ నెవర్'... చారుమతికి ఈ ఆలోచన చీకటి సొరంగం ఆవలివైపున వెలుగురేఖలా అనిపించింది. జీవితంమ్మీద చిన్న ఆశ చిగురించింది. గుండె తేలిక పడ్డట్లనిపించింది. 'ఇంకా తెలవారదేవి' అనుకుంది. తూర్పున పొడిచే రేపటి తొలిపొద్దు తన జీవిత గతిని మళ్ళీ మరల్చి తన ఆశల తీరానికి దారి చూపుతుందన్న గట్టి నమ్మకంతో బెర్త్‌మీద నడుంవాల్చింది. రైలు కదలికలకి కుదుటపడ్డ మనస్సు మెల్లగా నిద్రలోకి జారింది.

ఉదయం చారుమతి కళ్ళు తెరిచేసరికి రైలు కాజీపేట స్టేషన్‌లో ఆగివుంది. ఎదురుగా కనిపించిన దృశ్యం చారుమతికి ఆశ్చర్యం కలిగించడమే కాకుండా, జీవితంమ్మీద కోటి ఆశల్ని రేపింది. ఎదురుగా ప్లాట్‌ఫారంమ్మీద తమ్ముడు వెంకూ, ఎదురుసీటాయన నిలబడి కబుర్లు చెప్పకుంటూ కాఫీ తాగుతున్నారు. చారుమతి చటుక్కున లేడి పిల్లలా లేచి, గబగబా ముఖం కడిగేసుకొని క్రీమ్ రాసుకుంది. నుదిట పావలా కాసంత తిలకం బొట్టు దిద్దుకుంది. గబగబా తల దువ్వుకుని, జడల్లేసుకోవాలన్న ఆత్రంలో పడింది. 'రైలు కదగానే అతనితో మాట్లాడాలి. అతనిముందు తన మనస్సంతా విప్పి పరిచెయ్యాలి... తనకి తెలుసు, అతనికింకా పెళ్ళి కాలేదు... అతను గుడిపాటివాళ్ళ అబ్బాయే... తన కళ్ళు ఎప్పుడూ తనని మోసం చెయ్యవు... భగవంతుడా! నన్ను కాపాడు... నా ఈ మోడులాంటి జీవితానికి ఓ దారి చూపించు...' చారుమతి మనస్సులో ఉద్వేగం. తన జీవితంలోని అన్ని సమస్యలకీ పరిష్కారం మూర్తీభవించినట్టు ఎదురుగా ఆ వ్యక్తి. అవును గుడిపాటివాళ్ళ అబ్బాయే. ఇది కలా నిజమా?... తను అతిగా ఆశిస్తోందేమో?... నో!... దేవుడు ఎప్పుడూ అలా చెయ్యడు... తనెప్పుడూ నిద్రలో కూడా ఎవ్వరికీ కీడు తలవలేదు... తను చేసిన త్యాగం ఊరికనే పోదు... పోకూడదు....'

రైలు కూతవేసింది.... తమ్ముడు వెంకూ, ఆ వ్యక్తీ కరచాలనం చేసుకున్నారు. రైలు మెల్లగా కదిలింది. చారుమతి గుండె చప్పుళ్ళు ఆమె చెవులకి వినిపిస్తున్నాయి.. తమ్ముడు వెంకూ వడివడిగా నడిచి రైలు ఎక్కాడు... 'అతను కదలడే?' చారుమతిలో ఉద్వేగం పెరుగుతోంది. ఆ వ్యక్తి నిశ్చలంగా నిలబడి చారుమతికేసి చూస్తున్నాడు... చారుమతి కూర్చున్న కంపార్టుమెంటు మెల్లగా అతన్ని దాటి పోతోంది. చారుమతి చిన్న పిల్లలా కిటికీలోంచి రెండు చేతులూ చాచి "ఏవండీ!" అని అరవబోయి, మూగబోయింది... ప్లాట్‌ఫారమ్మీద అతను వెనుతిరిగి వెళ్ళిపోతున్నాడు... చారుమతి కళ్ళలో నయాగరా పొంగుతుంది. తను రాత్రంతా కట్టుకున్న ఆశల సౌధం, పేకమేడలా తన కళ్ళముందే కూలిపోతున్నట్టనిపిస్తోంది. తనని ఎవరో బలవంతంగా మళ్ళీ పంజరంలోకి ఈడుస్తున్నట్టనిపిస్తోంది.... తన మునివేళ్ళకి అందిన పట్టుకొమ్మ జారి, తను మళ్ళీ ఊబిలోకి కూరుకుపోతున్నట్టనిపిస్తోంది. నుదిటికి పట్టిన చమటకి తిలకం బొట్టు కరిగి, కన్నీళ్ళతో కలిసి బుగ్గలమీద నుంచి రుధిరధారలా కారుతోంది. భూమి రెండుగా చీలిపోయి, మొత్తం సభ్యసమాజం ఒక వైపు,... తనొక్కర్తె ఒంటరిగా... ఏకాకిగా మరోవైపు అయిపోయినట్టనిపిస్తోంది. జీవితం అంధకారం... శూన్యం... అల్లకల్లోలం... ఇంకా ఇంకా ఘోరంగా అనిపిస్తోంది.

తమ్ముడు వెంకూ మెల్లగా వచ్చి చారుమతి పక్కన కూలబడ్డాడు. "మనకి ఎదురుగా ఇది వరకు కూర్చున్న ఆయనదీ బరంపురంమేనట... వాళ్ళ ఇంటిపేరు గుడిపాటివారట. మన నాన్న గారు వాళ్ళకి బాగా తెలుసునట..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయి శోకదేవతలా సీటుకి అంటుకొని కూర్చుని ఉన్న అక్కని చూసి, అవాక్కైపోయాడు.

రైలుకి హృదయం లేదు. పూర్వ నిర్ణీత గమ్యం వైపు, నిర్ణీత మార్గంలో, నిర్ణీత వేగంతో సాగిపోతూనే ఉంది.

## దటీజ్ కమల్



తమిళ్‌లో హిట్ అయి తెలుగులో డబ్ అయి అశేష ప్రజానీకాన్ని ఆకర్షించిన భామనే సత్యభామనే చిత్రం హిందీలో పునర్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. హిందీలో చేసే ఈ సినిమాలో మరింత పర్‌ఫెక్షన్ కోసం మొత్తం పాత టీమ్‌ని మార్చేసి ఇంకా వినూత్నంగా తీస్తున్నారు. కాస్ట్యూమ్స్ డిజైనర్ పాత్రను మాత్రం 'సారిక' మిస్ కాకుండా పోషిస్తున్నది. 'మిసెస్‌ని' మాత్రం మిస్ కాడు కమల్.

## రహస్య చిట్కా

షాట్ షాట్‌కి మధ్య స్ప్రింక్లర్‌తో మొహానా అయిదు నిముషాల పాటు నీటి తుంపర్లని నాన్‌స్టాప్‌గా కొట్టించుకుని మరో అయిదు నిముషాలు ముఖాన్ని ఆరనిచ్చి కెమెరా ముందు కెళుతుంది సోనాలి బింద్రే. మేకప్ సామగ్రి వల్ల చర్మం పాడవకుండా వుండటానికి ఇదో టెక్నిక్‌ట! దాంతో ప్రతి పదినిముషాల గ్యాప్‌తో షాట్స్ తీస్తూ సతమతమౌతున్నారు ఆమె సినీ జనం.